క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బహుమతులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మెళియాపుట్టి: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇటీవల వ్యాసరచన, వక్తృత్వ, తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. వ్యాసరచనలో 9వ తరగతి విద్యార్థిని కీర్తన ప్రథమ బహుమతి (రూ.3 వేలు), వక్తృత్వ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని చాపర శ్రీజ ప్రథమ బహుమతి (రూ. 3 వేలు), మల్లారెడ్డి యువరాజ్ ఆంగ్లం వక్తృత్వంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు గెలుచుకున్నారు. గురువారం వీరికి నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను కరజాడలో హెచ్ఎం వెంకటరావు, వినియోగదారుల క్లబ్‌మాస్టర్ ఎల్.వి.చలం చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, ఆదినారాయణ, గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, గణేష్ కుమార్, పి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ కీలకం

హిరమండలం: సాగులో సస్యరక్షణ కీలకమని మండల వ్యవసాయశాఖ అధికారి బి.సంధ్య అన్నారు. గురువారం అంబావల్లి, రెల్లివలస, మహాలక్ష్మీపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల వినియోగం, సస్యరక్షణలో సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. రబీ పంటల విషయంలో సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. విత్తన ఎంపిక, ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సతీష్‌కు అభినందన



సతీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: గ్రామాల్లో క్రీడా ఆసక్తి కలిగిన యువకులు అనేక మంది ఉన్నారని, వారందరికీ అండగా ఉండటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కంబకాయ గ్రామానికి చెందిన పాగోటి సతీష్ కలకత్తాలో జరిగిన అండర్ 23 నేషనల్ బాడీ బిల్డింగ్-2024 చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిన్ని పోటీల్లో పాల్గొని జిల్లాతోపాటు నరసన్నపేట, కంబకాయ ఖ్యాతిని ఇనుమడింప జేయాలన్నారు. గ్రామానికి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్ర చెరువు ఆక్రమణల గుర్తింపు



కొలతలు వేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పాతపట్నం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణలను గుర్తించి, తొలగించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఎర్ర చెరువును తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ బి.రామగణపతి, సచివాలయ సర్వేయర్లు కొలతలు చేపట్టారు. రికార్డు ప్రకారం ఐదెకరాల రెండు సెంట్ల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. చెరువు ఎంతవరకు ఆక్రమణలకు గురైందో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. పైల బాబ్జి, ఆర్ఐ పి.బాబీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

డీఎఫ్ఓను కలిసిన అటవీశాఖ కార్యవర్గం



డీఎఫ్‌తో అటవీశాఖ కార్యవర్గ సభ్యులు

సారవకోట: జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్‌ను నూతనంగా ఏర్పడిన జిల్లా జూనియర్ ఫారెస్ట్ అధికారుల అసోసియేషన్ సభ్యులు శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో గురువారం కలిశారు. అధ్యక్షుడిగా ఆర్.వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడిగా జాకిర్ హుస్సేన్, కార్యదర్శిగా ఎల్.ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.రంజిత్‌కుమార్, జాయింట్ కార్యదర్శిగా సి.హెచ్.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని డీఎఫ్ఓ అభినందించారు.

పాముకాటుతో బాలుడికి తీవ్ర అస్వస్థత

పొందూరు: మండల కేంద్రంలోని రాపాక కూడలి వద్ద కొంచాడ సురేంద్ర అనే బాలుడు గురువారం సాయంత్రం పాముకాటుకు గురయ్యాడు. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన వెంటనే ఇంటి వెనుకకు ఆట ఆడేందుకు వెళ్లాడు. సమీపంలోని గడ్డివాములో నుంచి పాము వచ్చి కాటువేసినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే పొందూరు సీహెచ్‌సీకి తల్లిండ్రులు రాధాకృష్ణ, జయమ్మ తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత తెలిపారు.

విద్యుత్ చార్జీల బాదుడు

- రెండేళ్లపాటు బిల్లుల్లో సర్దుబాటు పేరున ఆర్థిక భారం
- నరసన్నపేట నియోజకవర్గంలో నెలవారీ రెండు కోట్లకు పైగా వడ్డన
- ఇదేం పెంపు అంటున్న విద్యుత్ వినియోగదారులు



నరసన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్



నరసన్నపేట నియోజకవర్గంలో విద్యుత్ సర్వీసుల వివరాలు

మండలం	విద్యుత్ సర్వీసులు
నరసన్నపేట టౌన్	15,895
నరసన్నపేట రూరల్	15,284
జలుమూరు	19,322
పోలాకి	22,257
సారవకోట	15,907

నరసన్నపేట: ఎన్నికల ముందు ఒకమాట.. అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా ఉంది కూటమి నాయకుల తీరు. దీనికి నిదర్శనమే విద్యుత్ బిల్లుల భారం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలును పక్కనపెట్టి.. ప్రజలపై బాదుడే బాదుడు అన్నట్లుగా విద్యుత్ చార్జీలు పెంపు ఉంది. ఇందన చార్జీల పేరుతో యూనిట్‌కు ఇప్పటికే రూ.0.60 పైసల భారం మోపారు. జనవరి నుంచి యూనిట్‌కు మరో రూ.0.45 పైసలు పెరగనుంది. ప్రతీ మూడు నెలలకు వడ్డన ఒక్కోలా ఉంటుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఇప్పటికే ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఈడీ చార్జీలు, సర్‌చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీఏ-2 పేరున భారాన్ని వినియోగదారులు మోస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఎనర్జీ చార్జీ పేరిట అదనంగా మళ్లీ వసూలు చేయనుంది. రెండు విడతలుగా సరాసరిన యూనిట్‌కు రూ.1.05 పైసలు పెరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు అంటున్నారు. దీంట్లో రూ.0.60 భారం రెండు నెలల వరకు ఉంటుంది. రూ.0.45 పైసలు భారం మాత్రం వచ్చే రెండేళ్ల వరకు భరించాల్సిందే. 2026 నవంబర్ వరకు ఈ అదనపు చార్జీల భారం ఉంటుందని అధికారులు అంటున్నారు. కేటగిరీ-2 మీటర్లకు మరింతగా అదనపు వడ్డన ఉంటుంది. సామాన్యుల నుంచి పారిశ్రామిక వేత్తల వరకు అదనపు చార్జీల భారం చెల్లించాల్సిందే.

వినియోగదారులపై ఆర్థిక భారం..

నరసన్నపేట నియోజకవర్గంలో సుమారుగా నెలవారీ రూ.2 కోట్ల వరకు విద్యుత్ వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుంది. గృహ అవసరాల వినియోగదారులు మరింతగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవేం సర్దుబాట్లు అని మండిపడుతున్నారు. ఎంత విద్యుత్ వాడితే అంత చెల్లిస్తున్నాం .. మళ్లీ ఈ కొత్త వడ్డింపులు ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు ఒక్క పైసా బిల్లులు పెంచబోమని చెప్పి.. ఇప్పుడు ఎలా పెంచుతారని వినియోగదారులు మండిపడుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఈ భారం స్పష్టంగా తెలియనుందని విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

సామాన్యులపై పెను భారమే



పెరిగిన విద్యుత్ బిల్లులు సామాన్య, మధ్య తరగతి వినియోగదారులకు పెను భారమే. ప్రభుత్వం కనీసం ఆలోచన చేయకుండా విద్యుత్ సర్‌చార్జీల పేరిట వడ్డనకు సిద్ధపడటం ఆందోళన కలిగించే విషయం. వచ్చీ రాగానే కూటమి నాయకులు విద్యుత్ చార్జీల పేరిట ఆర్థిక భారం మోపడం ఈ ప్రభుత్వ తీరు అర్థం అవుతోంది.

– తోట భార్గవ్, గోపాలపెంట, నరసన్నపేట మండలం

అదనపు చార్జీలే ఎక్కువ



ప్రస్తుతం వచ్చే విద్యుత్ బిల్లుల్లో వినియోగించిన యూనిట్ చార్జీల కంటే.. అధికంగా సర్ చార్జీలే ఉంటున్నాయి. మళ్లీ ఇప్పుడు అదనంగా చార్జీలు విధించడం.. అదీ రెండేళ్ల వరకు ప్రతినెలా చెల్లించాలనడం ఆందోళనకరమే.

– ముచ్చు గణేష్, తామరాపల్లి, నరసన్నపేట మండలం

ప్రస్తుతం గ్రామాల్లో ఒక బిల్లుకు ఒక వినియోగదారుడు చెల్లిస్తున్న అదనపు చార్జీలు..

ఫిక్స్‌డ్ చార్జీలు	కస్టమర్ చార్జీలు	ఈడీ చార్జీలు	ఎఫ్‌పీపీసీఏ	ఎఫ్‌పీపీసీఏ-2 చార్జీలు
రూ.10	రూ.45	రూ.6.84	రూ.158	రూ.83

స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం చేయండి



పాతపట్నం: మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎల్.ఎన్.పేట: జనవరి 4 నుంచి 7వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవాల మహా సభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్‌శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం స్వర్ణోత్సవ మహాసభల జెండాను ఆవిష్కరించారు. స్వర్ణోత్సవ మహాసభల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. యూటీఎఫ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, ఆర్.మోహనరావు, శ్రీలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, జి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర పూర్వ కార్యదర్శులు గొంటి గిరిధర్, ఎం.వాగ్దేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి, నాయకులు సురవరపు జయరాం, ఎస్.ఢిల్లేశ్వరరావు, చిన్నారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అలుపెరగకుండా శ్రమిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బ్యారేజ్ సెంటర్‌లో జిల్లా కౌన్సలర్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా పతకావిష్కరణ చేశారు. జిల్లా కౌన్సిలర్‌లు నారా శంకరరావు, కోటేశరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.గిరిధర్, ఎస్.కిశోర్‌కుమార్, మండల కార్యవర్గ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల నారాయణరావు, రామకృష్ణ, యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.మోహన్‌రావు, ఆర్.ఆనందరావు, మద్దిల శంకరరావు, రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటనష్టం పరిశీలన



జగన్నాథపురంలో వరి కుప్పలను పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: తడిసిన, మొలకెత్తిన ధాన్యంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని పలాస ఏడీ మధుబాబు, స్థానిక తహసీల్దార్ పాపారావు అన్నారు. గురువారం మండలంలోని శేఖరాపురం, జగన్నాథపురం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. తడిసిన వరికుప్పలు, కళ్లాల్లో వేసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు సూచినలిచ్చారు. మండలంలో అన్ని గ్రామాల్లో తిరిగి ఇదేవిధంగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో పైఅధికారులకు నివేదిస్తామన్నారు. పలువురు రైతులు వారికి జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టిలోకి తీసుకెళ్లారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసిముద్ద అయిందని, కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతులు కోరారు. పలువురు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రహరీ కూలడంతో చెల్లాచెదురుగా పడి ఉన్న ధాన్యం బస్తాలు

కొత్తూరు: మండలంలోని శ్రీసాయికృష్ణ మోహన్ రైస్ మిల్లు వద్ద గురువారం పెను ప్రమాదం తప్పింది. తుఫాన్ కారణంగా గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు మిల్లు ప్రహరీ తడిసి ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రహరీకి ఆనుకొని ఉన్న ధాన్యం బస్తాలపై గోడ పడింది. అప్పటివరకు పని చేస్తున్న కలాసీలు గోడ కూలే సమయంలో అక్కడ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

రేషన్ డిపో డీలర్ల నోటిఫికేషన్ విడుదల

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఖాళీగా ఉన్న 20 రేషన్ డిపో డీలర్ల పోస్టుల భర్తీ కోసం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా రేషన్ డిపో డీలర్లు తమ పోస్టులకు రాజీనామా చేయటం, కొందరు మహిళా డీలర్లు వివాహం జరిగిన తరువాత రాజీనామా చేసి అత్తవారింటికి వెళ్లడం, కొందరు డీలర్లు మరణించటం, కొన్నిచోట్ల కొత్తగా రేషన్ డిపోలను ఏర్పాటు చేయటం వంటి కారణాలతో రేషన్ డీలర్ల పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అర్హత ఉన్నవారు జనవరి 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా నేరుగా, రిజిస్టర్ పోస్టుద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనవరి 10న దరఖాస్తుల పరిశీలన, 17న హాల్ టికెట్ల జారీ, 19వ తేదీ ఉదయం 11 గంటలకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రాత పరీక్ష, 23న ఫలితాల వెల్లడి, 27న ఇంటర్వ్యూ, 30న తుది ఫలితాలను వెల్లడిస్తామన్నారు. హిరమండలం మండలంలో హిర మండలం (ఓసీ), మెళియాపుట్టి మండలంలోని వసుందర (ఓసీ- మహిళ), చినహంస (ఎస్టీ), పాతపట్నం మండలంలోని సరాళి (ఎస్టీ), కొరసవాడ(బీసీ-డి), పాతపట్నం (బీసీ-ఈ), పాతపట్నం-1 (ఈడబ్ల్యూఎస్), పాతపట్నం-2(ఎస్సీ-మహిళ), పాతపట్నం-3(బీసీ-బి), తెంబూరు-1 (ఓసీ-మహిళ), పెద్దసరియాపల్లి (ఎస్సీ), కొత్తూరు మండలంలో కొత్తూరు-5 (బీసీ-డి మహిళ), కొత్తూరు-6 (బీసీ-ఈ), కర్లెమ్మ (బీసీ-ఎ), మహారథపురం (ఎస్సీ), కృష్ణాపురం (ఓసీ), శోభనాపురం (ఓసీ-మహిళ), అల్తిగూడ (ఎస్టీ), ఎల్.ఎన్.పేట మండంలోని బసవరాజుపేట (బీసీ-బి మహిళ), సిద్ధాంతం (బీసీ-ఎ)కి కేటాయించినట్లు పేర్కొన్నారు.

సారవకోట మండలంలో

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న పలు డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంట్లో చీడిపూడిని ఓసీ మహిళకు, చిన్నగుజ్జువాడను ఎస్సీ, చోడసముద్రం బీసీ-డికి, పెద్దగుజ్జువాడను ఈడబ్ల్యూఎస్ కేటాగిరిలకు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు వచ్చే ఏడాది జనవరి 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువతకు ఆదర్శం ఎం.వి.వి.ఎస్.శాస్త్రి



శాస్త్రిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యారావు

బూర్జ: సుమారు 2,500 కోర్సులకు సంబంధించిన డిగ్రీలను పూర్తిచేసిన ఎం.వి.వి.ఎస్.శాస్త్రి నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. గురువారం శ్రీకాకుళంలో శాస్త్రిని సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రెండేళ్ల వ్యవధిలో 2500 కోర్సులు పూర్తిచేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, రెండు తెలుగు రాష్ట్రాల రికార్డులు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో శాస్త్రి పేరు సంపాదించడం గొప్ప విషయమన్నారు. తొగరాం నీటి సంఘం అధ్యక్షుడు, కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పొందూరు: స్థానిక నాయుడు వీధిలో ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. తొడ భాగంలో గాయాలయ్యాయి. దాడి చేసిన సమయంలో వీధిలోని యువకులు చూసి కుక్కను కర్రలతో కొట్టడంతో పారిపోయింది. బాలుడిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. కుక్కల బెడద లేకుండా చేయాలని పంచాయతీ అధికారులను స్థానికులు కోరారు.

రహదారి పనులు ప్రారంభం

పోలాకి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యపడుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని చీడివలస, జొన్న య్యపేట, సన్యాసిరాజుపేట తదితర గ్రామాల్లో రహదారి పనులను ప్రారంభించారు. మండల పరిషత్ ప్రత్యేక సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎం.వి.ఎ.నాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోరుబాట విజయవంతం చేయండి



పాతపట్నం: పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

పాతపట్నం: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు, మండల సచివాలయ మాజీ కన్వీనర్‌లు సవిరిగాన ప్రదీప్, ఎనుగుతల సూర్యం కోరారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరుబాట వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో నిరసన కార్యక్రమం చేస్తున్నామని, అందరూ తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కొండాల అర్జునుడు, మద్దు తాతయ్యలు, నాయకులు పనుకు మోహన్, చింతాడ త్రినాథరావు, తూలుగు ప్రవీన్, మజ్జి వరదరాజులు, టంకాల సుధాకర్, ఎం.తిరుపతి, శ్రీధర్, ఫల్గుణరావు, సుందరావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పోరుబాట పోస్టర్‌ను పార్టీ సీనియర్ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పోలాకి జయమునిరావు, పరపటి యోగీశ్వరరావు, ఉలాస రవికుమార్, రామరాజు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, సీనియర్ నాయకులు ఏవీ సురేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లోలుగు లక్ష్మణరావు, వి.చిన్నారావు, మీసాల రామారావు, పతివాడ అప్పలనాయుడు, బాలకృష్ణ, శంకర్, చందు, కృష్ణ, కిరణ్, సింహాచలం, హరి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: నియోజకవర్గం కేంద్రం పాతపట్నంలో శుక్రవారం నిర్వహించనున్న పోరుబాట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి కోరారు. మండల కేంద్రంలో పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు శిమ్మ సాంబశివరావు, కొల్ల కృష్ణ, ఈగల చిన్నారావు, కొల్ల లక్ష్మునాయుడు, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: పాతపట్నంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ కోరారు. కొత్తూరులో పోరుబాట పోస్టర్‌ను ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కలమట రమేష్‌బాబు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ నాయకులు వడమ లక్ష్మీనారాయణ, వనము లక్ష్మీనారాయణ, తమ్మినాయుడు, నాగేశ్వరరావు, హరిదాసు, ఎండు నాయుడు, పూర్ణ, రమేష్, నిమ్మగడ్డ కృష్ణారావు, మఠం పూర్ణ, డి.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి, తదితరులు



మెళియాపుట్టి: పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోరుబాట ఇలా..

నరసన్నపేట: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపడుతున్న పోరుబాట కార్యక్రమం మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో జరుగుతుంది. నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటకు నాలుగు మండలాల పార్టీ శ్రేణులు వస్తున్నారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వైఎస్సార్ కూడలి వద్దకు వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడ నుంచి పాతబస్టాండ్, పల్లిపేట కూడలి మీదుగా విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: నియోజకవర్గ కేంద్రంలోని కండ్రపేట జంక్షన్ ఒన్ వే ట్రాఫిక్ రోడ్ వద్ద 'విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' నిరసన కార్యక్రమాన్ని నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరులో గల పార్టీ క్యాడర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొంటారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరుబాట వివరాలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొంటాయన్నారు.



హిరమండలం: పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



కొత్తూరు: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఘనంగా కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

జలుమూరు: మండలంలోని చల్లవానిపేటలో వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, ఎం.శ్యామాలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కునుసు సీతారాం, రాజప్పలనాయుడు, విజయ్, వి.రమణి, తదితరులు పాల్గొన్నారు.

తమ్మినాయుడికి ఘన సన్మానం



తమ్మినాయుడును సత్కరిస్తున్న పార్టీ నేతలు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 ఆర్అర్ కాలనీకి చెందిన సొంట్యాన తమ్మినాయుడును కొత్తూరులో పార్టీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో ఈయనను పార్టీ ఇటీవల నియామకం చేసింది. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడంతోపాటు పార్టీ పటిష్టత కోసం నిరంతరం పని చేస్తానని తమ్మినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కలమట రమేష్‌బాబు, వడమ శ్రీనివాసరావు, సర్పంచ్ సాధుబాబు, ధర్మారావు, గండిలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, ఎండు నాయుడు, హరిదాసు, రాజులునాయుడు, నిమ్మగడ్డ కృష్ణారావు, అగతమూడి నాగేశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.